మినీ మేడారానికి పోటెత్తిన జనం

- ఆదివాసీ సంప్రదాయాల నడుమ గద్దెకు చేరిన సారక్క
- వనదేవతలకు ప్రత్యేక పూజలు
- దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మణుగూరురూరల్: అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


మణుగూరురూరల్: బంగారంతో వెళ్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


కరకగూడెం: వన దేవతకు ఎదుర్కోలు నిర్వహిస్తున్న భక్తులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని తోగ్గూడెం సమ్మక్క–సారలమ్మ దేవాలయం (మినీ మేడారం) లో జరుగుతున్న జాతరకు భక్తజనం పోటెత్తుతున్నారు. మినీమేడారం గద్దెలపై వనదేవతలు గద్దెలపై కొలువుదీరారు. బుధవారం సారలమ్మ తల్లి గద్దెకు చేరారు. గురువారం ఉదయం ఆదివాసీ పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులతో కలిసి రథంగుట్ట వనం నుంచి సమ్మక్క తల్లిని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, మేళ తాళాలు, డప్పువాయిద్యాలు, కొమ్ము నృత్యాల నడుమ అంగరంగ వైభవంగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గద్దెకు చేర్చారు. వనదేవతలిద్దరు గద్దెలకు చేరడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవార్లను దర్శించుకుని బంగారం(బెల్లం)ను నేవైథ్యంగా సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మణుగూరు మండల, పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా మేడారం జాతరకు వెళ్లి వచ్చే భక్తులు సైతం తోగ్గూడెం మినీమేడారంలో ఆగి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలైన నెమలిపించాలతో కూడిన కొమ్ములను ధరించి భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఆలయ ప్రాంగణంలో ఆటవీ ప్రాంతమంతా భక్తులతో జనసందోహంగా కనిపించింది. గద్దెకు చేరిన సారలమ్మ తల్లిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతరలో ఎలాంటి తొక్కిసలాటలూ, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు పకడ్బందీగా భద్రత చర్యలు చేపట్టారు.

అన్నదాన కార్యక్రమం..

జాతర వచ్చే భక్తుల సౌకర్యార్థం వాసవి క్లబ్, వాసవితా వైభవ్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రెండో రోజు అన్నదాన కార్యక్రమాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దోసపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్లు దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి పిచ్చేశ్వరరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ కోఆర్డినేటర్ బండారు నరసింహారావు, అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్, శ్యామ్, సీహెచ్ నాగరాజు, వనిత క్లబ్ సభ్యులు బి.అంజలి, టి.వసుధ, వసుంధర, శేషుబాబు, సీహెచ్ రమేష్‌బాబు, కె.రాము, ఉమ, నాగరత్నమణి, ప్రభాకర్, ఆర్య వైశ్య సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ..

తోగ్గూడెం మినీ మేడారానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని రెండో రోజు కార్యక్రమాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న అయ్యప్పదీక్ష సమితి వారిని అభినందించారు. కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు తనుగుల శ్రీను, సింహాద్రి కిరణ్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఎదిరగుట్టల దేవాలయంలో..

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయతీలో ఉన్న ఎదిరగుట్టల్లో ఉన్న సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మల సుంకు జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన ఎదిరగుట్టల సమ్మక్క సారలమ్మ దేవాలయంలో ప్రతీ రెండేళ్లకోసారి గిరిజన సాంప్రదాయాల ప్రకారం సుంకు జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ పూజారి పూనెం సమ్మయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసం మునలయ్య నేతృత్వంలో కొనసాగుతున్న సుంకుజాతరకు రెండో రోజు కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఎదిర గుట్టలు భక్తులతో కిటకిటలాడగా, సమ్మక్క సారలమ్మల నామస్మరణలతో ఆ ప్రాంతం మారు మోగింది.


చర్ల: ఎదిరగుట్టలో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు


కరకగూడెం: వన దేవత సమక్కను తీసుకొస్తున్న భక్తులు, దేవరబాల

చిరుమళ్లలో..

కరకగూడెం: మండలంలోని చిరుమళ్ల గ్రామ పంచాయతీలో సమ్మక్కసారలమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలోని వన దేవత సమ్మక్కను గురువారం 'సమ్మక్క గుట్ట'నుంచి భక్తి శ్రద్ధల నడుమ దేవరబలా రామారావు ఆధ్వర్యంలో తీసుకువచ్చి గద్దెలపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అంతేకాకుండా భక్తుల ఇలవేల్పు కొంగు బంగారం.. కోరిన వరాలు ఇచ్చే వన దేవతలను మది నిండా తలచుకుంటూ భక్తులు దర్శించుకుని పరవశించారు. గుట్టలో కొలువై ఉన్న సమ్మక్కను తీసుకువచ్చేందుకు ముందుగా గ్రామాన్ని శుద్ధి చేయడంతో పాటు గద్దెల ప్రాంగణాన్ని మొత్తం శుద్ధి చేశారు. అప్పటికే గద్దెలపై కొలువైన సారలమ్మ, పగిడిద్ద రాజు, గొవింద రాజుల గద్దెలను అందంగా జాతర నిర్వాహకులు అలంకరించారు. అలాగే సమ్మక్క గద్దెను శుద్ధి చేయడంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించి గద్దెపై ప్రతిష్ఠించారు. సమ్మక్క తరలివస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని శివసత్తుల విన్యాసాలు, భక్తుల పూనకాలు హోరెత్తాయి.

క్లుప్తంగా

నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

అశ్వారావుపేట: రాష్ట్ర జనాభాలో ఆరు శాతంగా ఉన్న ఆర్యవైశ్యులకు ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య, యువజన సంఘాల మాజీ అధ్యక్షుడు కొదుమూరి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్యవైశ్య సమాజం అత్యధిక శాతం అధికార పార్టీ వైపే నడిచిందని, ప్రభుత్వ ఏర్పాటులో కృషి ఉందని అన్నారు. ఆర్యవైశ్యులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ నానినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా రాజకీయం ప్రాధాన్యత కల్పించాలని వినతి చేశారు. సమావేశంలో సంఘం బాధ్యులు కొణిజర్ల ఉమామహేశ్వరావు, శీమకుర్తి శ్రీనివాసరావు, శీమకుర్తి జీతేంద్ర, యశోధ, సత్యానంద్, దేవరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చరణలతో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: మండలంలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం మండలంలోని నాచారం గ్రామంలో మృతి చెందిన రాజులపాటి కృష్ణయ్య భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. గండుగులపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణస్వామి పేరున మంజూరు చేయించిన రూ.1,90,000ల ఎల్‌ఓసీ పత్రమును వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం మండలంలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్, వట్టి వెంకట్రావు, మడకం రాజేష్, శ్రీకాంత్, చిన్నశెట్టి మధు, జెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

24 నుంచి విజయ భవాని జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారం వారిగూడెం కాలనీ గ్రామంలో ఉన్న మేల్‌మర వర్తూర్ ఆదిపరాశక్తి విజయ భవాని అమ్మవారి ఆలయంలో జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు గేదెల విష్ణుమూర్తి, సరోజిని దంపతులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ జాతర ఉత్సవాలు జరుగనున్నట్లు, ముగింపు రోజున భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులంతా అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భద్రాచలంటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సన్నీ ఉదయ ప్రతాప్ సూచించారు. పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మా నివాసం వద్ద నిర్వహించిన విజయ సంకల్ప యాత్ర, ప్రారంభ బహిరంగ సభ ఏర్పాట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం డివిజన్‌లో ఈ నెల 25న జరిగే విజయ సంకల్ప యాత్ర, ప్రారంభ భారీ బహిరంగ సభకు ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు, బీజేపీ కార్యకర్తలు, నాయకులు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో క్రాంతి కుమార్, రామ్మోహన్‌రావు, వెంకన్న, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నిఖిల్, హరీష్, కన్నయ్య, సమ్మయ్య, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుడు మృతి

అశ్వాపురం: మండల కేంద్రాకి చెందిన ఏఐటీయూసీ మండల కార్యదర్శి చింతకాయల అప్పారావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బ్రెయిన్ స్ట్రోక్‌తో బుధవారం రాత్రి మృతి చెందాడు. అప్పారావు మృతదేహంపై గురువారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్యాచారి అరుణ పతాకం కప్పి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, రాజేష్, ఈనపల్లి పవన్‌సాయి, కమలాకర్, శ్రీకాంత్, బాబురావు, వెంకటనరసయ్య, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంతోష రూప

దుమ్ముగూడెం: పోక్సో చట్టంపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్ర మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప సూచించారు. గురువారం మండలంలోని నర్సాపురంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి–శిశు సంక్షేమ శాఖ, కొత్తగూడెం జిల్లావారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం వారి 'బాలికలను రక్షిద్దాం–బాలికలను చదివిద్దాం'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అవగహన కల్పించారు. బాలికల్లో లైంగిక వేధింపులు ఎలా ఉంటాయి, అటువంటి సందర్భాలలో ఎలా రక్షణ పొందాలి, అత్యవర సందర్భంలో 1098, 14567,101 టోల్ ఫ్రీ నంబరులకు ఫోన్ చేయడం ద్వారా సహాయం ఎలా పొందొచ్చు తదితర అంశాలపై వివరించారు. పోక్సో చట్టం బాధిత బాలికలకు ఏ విధంగా ఉపాయోగపడుతుందో తెలిపారు. బాలికల నిష్పత్తి తక్కువగా ఉండటానికి కారణాలు, బాల్య వివాహాల నివారణ కోసం ప్రభుత్వాలు ఏమి చేస్తున్నాయో తెలిపారు. సైబర్ నేరాలపై అవగాన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

చర్లరూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల వైరల్ జ్వరాలు, కీళ్ల నొప్పులు అధికంగా వస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీధర్ సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరుశుభ్రంగా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. నీటి నిల్వలలో యాంటీ లార్వాల్(తెమీఫోస్)ద్రావణం చల్లుతూ, దోమలు గుడ్లు పెట్టి పెరగకుండా నీటి గోలాలపై మూతలు పెట్టుకోవాలని సూచించారు. జ్వరాలు ఉన్న వారి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శిరీష,గీత హెల్త్ అసిస్టెంటు సరస్వతి, ఆశా కార్యకర్తలు లలిత, చంద్రకళ, సమ్మక్క, విజయ, లక్ష్మి, వెంకటరమణ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు..

కరకగూడెం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికి శ్రద్ధ అవసరమని, నేటి ఆధునిక జీవితంలో ఒడిదుడుకుల కారణంగా చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారని సీఎస్సీ హెల్త్ కేర్ క్యాంప్ జిల్లా కోఆర్డినేటర్ అక్బర్ పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని సమత్ భట్టుపల్లి, కరకగూడెం గ్రామ పంచాయతీల ఆవరణలో భవన నిర్మాణ కార్మికులను పరీక్షించి వివిధ రకాల రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాగా సుమారు 120 మంది నుండి రక్త నమూనాలు సేకరించామని 5 రోజుల తరువాత వారికి రక్త పరీక్షల రిపోర్ట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ మహేష్, సిబ్బంది దుర్గా, అంజలి, గౌతమి, సరిత, ప్రసన్న, బేబీ తదితరులు పాల్గొన్నారు.


చంద్రుగొండ: విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కంటి వైద్యశిబిరం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. సమస్య ఉన్న విద్యార్థులకు ఉచితంగా అద్దాల పంపిణీతోపాటు శస్త్రచికిత్సలు చేయిస్తామని ఇన్స్టిట్యూట్ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, మంజూశ్రీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దమ్మపేట: ఇటీవలే గుండెపోటుతో ఏఎస్సై మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులకు దమ్మపేట ఎస్సై సాయికిషోర్‌రెడ్డి ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు ఇటీవలే గుండెపోటుతో మరణించారు. ఖమ్మం జిల్లాలోని మధిరలో నివాసముంటున్న వారి కుటుంబానికి ఎస్సై రూ.20వేల ఆర్థిక సహాయం, తన సిబ్బంది ద్వారా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది వారిని పరామర్శించి, అన్ని విధాలుగా డిపార్ట్‌మెంట్ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై సీమ, కానిస్టేబుళ్లు నాగముత్యం, వెంకట్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో గురువారం అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణ చందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ..ఎటువంటి భయాందోళనలు చెందకుండా పది పరీక్షలను ధైర్యంగా రాయాలన్నారు. పది పరీక్షలు ముగిసే వరకు క్లబ్ ఆధ్వర్యంలో ఆల్పాహారం అందిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణజ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ రీజియన్ చైర్‌పర్సన్ గాజుల రమేష్‌కుమార్, సాంబాయిగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలత, ఉపాధ్యాయులు మీరాహుస్సేన్, సావిత్రి, రాజ్యలక్ష్మి, పీఈటీ కవిత, ధనలక్ష్మి, కల్పనదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలోని షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు బాబాను దర్శించుకుని వివిధ రకాల పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారు. అలాగే హారతులు పట్టి, పల్లకి సేవలు చేసి నైవేథ్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న సమయంలో ఆలయాల్లో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు హాజరయ్యారు.

మార్చి 3 నుంచి పల్స్ పోలియో

అన్నపురెడ్డిపల్లి: మండలంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల వ్యాప్తంగా 0-5 వసంవత్సరాల లోపు వయస్సు ఉన్న 2,489 మంది చిన్నారులను గుర్తించినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించి, చిన్నారులకు పోలియో చుక్కలను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మార్చి 3న పల్స్ పోలియోను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ ఎండీ ముజాహిద్ సూచించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల పరిధిలో నాలుగు రూట్లలో 44 బూత్‌లు, ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11 వలస ఆదివాసీ ప్రాంతాలలో కూడా పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండలంలో 5 ఏళ్ల లోపు వయసు కలిగిన 3,105 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు.అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, ఎంపీడీఓ జమలారెడ్డి, సీడీపీఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ముజాహిద్

పరిశీలించి పరిష్కరిస్తా..

ములకలపల్లి: సెంట్రల్ లైటింగ్ పనుల్లో నిర్మాణాలు తొలగించే అంశాన్ని పరిశీలించి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వ్యాపారులకు, స్థానికులకు హామీ ఇచ్చారు. ములకలపల్లి మండలంలో గురువారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా మండలకేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ శనగపాటి అంజి స్వగృహంలో ఎమ్మెల్యేకు పలువురు వ్యాపారులు వినతిపత్రం అందజేశారు. 50 అడుగుల లోపలగల నిర్మాణాలు తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదేశాలు జారీ చేశారని, ఐతే దానిని 40 అడుగులకే పరిమితం చేయాలని వారు అభ్యర్థించారు. చిరువ్యాపాలకు న్యాయం చేయాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడారు. ఎవరూ అధైర్యపడవద్దని, సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి, న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గణిత పోటీల్లో రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానం సాధించిన ములకలపల్లి విద్యార్థిని రుద్రం శ్రేష్ఠ, తల్లిదండ్రులు దుద్రం ప్రభాకర్, హెమీమా దంపతులను ఎమ్మెల్యే దుశ్శాలువతో సత్కరించారు. శ్రేష్ఠ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ ఉపసర్పంచ్ శనగపాటి అంజి, మాజీ జెడ్పీటీసీ బత్తు అంజి, గాడి తిరుపతిరెడ్డి, పద్దం బుజ్జి, డాక్టర్ కొమ్ము నాగరాజు. లలితారావు, మేకల రాజేశ్, బిక్కుమళ్ల ప్రభాకర్, భాస్కర్, ఉమేశ్, వాసూరావు, నాగవిజయేంద్ర గుప్త జహీర్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే ఆదినారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

పరామర్శ..

మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి తండ్రి బత్తుల మల్లయ్య 4వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె పాల్గొన్నారు. మల్లయ్య విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న ములకలపల్లికి చెందిన వ్యాపారి అద్దంకి నాగేశ్వరావును పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుధాకర్ పువ్వాల మంగపతి, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, శ్రీరాముల నాగేశ్వరరావు, తన్నీరు నాగయ్య, అనుమల నర్సింహారావు, కృష్ణ, సీతారాములు పాల్గొన్నారు.

సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం


శాంతి ప్రగతి యాత్రను ప్రారంభిస్తున్న ఏరియా జీఎం రామచందర్

మణుగూరురూరల్: స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. ఏరియాలోని పివికాలనీ సింగరేణి పాఠశాలలో గురువారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బడేన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సర్వమత ప్రార్థనను నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో జీఎం రామచందర్ మాట్లాడుతూ.. స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించి మానవ జాతికి చేసిన సేవలకు గాను రాబర్ట్ బడెన్ పావెల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ ఏడాది ఫిబ్రవరి 22న వరల్డ్ థింకింగ్ డేను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. పిల్లలు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరేందుకు తల్లిదండ్రులు తమ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆపై శాంతి ప్రగతి యాత్రను జీఎం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్), సింగరేణి హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్.రమేష్, పాఠశాల హెచ్‌ఎం.స్వరూపారాణి, స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ బి.సరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర దిష్టిబొమ్మ దహనం

దమ్మపేట: రైతాంగ సమస్యలపై పాదయాత్ర చేస్తున్న రైతులపై రబ్బరు బులెట్లతో కాల్పులు జరిపించిన కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గురువారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో రైతుల పట్ల వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండిస్తూ, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు అమర్లపూడి రాము మాట్లాడుతూ.. పంజాబ్ రాష్ట్రంలోని ఖనౌరీ వద్ద రబ్బరు బులెట్లతో కాల్పులకు ఆదేశించిన పోలీస్ అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొడ్డా లక్ష్మీనారాయణ, శివకృష్ణ, బండి ఆదినారాయణ, కుర్సం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పంజాబ్, హర్యానా సరిహద్దుల లో శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం రబ్బర్ బుల్లెట్లతో దాడులు జరపటం అమానుషమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు వైఎస్ రెడ్డి అన్నారు. రైతులపై దాడులను నిరసిస్తు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం సారపాకలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో బుద్ధిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న, రాము, ప్రసాద్, రామకృష్ణ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఢిల్లీ రైతు ఉద్యమకారులపై పోలీసుల కాల్పులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్ కోరారు. గురువారం స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో రైతులపై కాల్పులు, యువ రైతు ప్రాణాలు కోల్పడంపై ప్రధాన మంత్రి మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు ఉద్యమంలో పోలీసుల కాల్పులకు బాధ్యత వహిస్తూ, బీజేపీ ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గన్నిన రామకృష్ణ, ప్రజాపంథా జిల్లా నాయకులు కంగాల కల్లయ్య, గొంది లక్ష్మణరావు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేస్తున్న నాయకులు

గుండాల: శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పంజాబ్ రైతులపై హర్యానా పోలీసులు చేసిన ఫాసిస్టు దాడిని ఖండించాలని అఖిలపక్షం నాయకులు అన్నారు. దాడి నిరసిస్తూ మండల కేంద్రంలో అఖిలపక్ష ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, గుండాల సర్పంచ్ కొమరం సీతారాములు, కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె. ఖదీర్, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. హర్యానా పోలీసుల కాల్పుల్లో చనిపోయిన యువరైతు శుభకరం సింగ్ కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేయా కల్పించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కాల్పులకు బాధ్యులైన పోలీసులను ఉద్యోగాల నుండి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో న్యూ డెమొక్రసీ నాయకులు ఈసం కృష్ణన్న, పెండే కట్ల పెంటన్న,పర్శక రవి, మానాల ఉపేందర్, సీపీఐ నాయకులు ఎస్‌కె.షాహిద్, ప్రజాపంథ నాయకులు కోడూరు జగన్, దళిత సంఘం నాయకులు బొమ్మెర్ల నాగేష్ పాల్గొన్నారు.